

# అతీతం

ప్రొ॥ రామచంద్రమౌళి

అరవై ఏళ్ళ నిర్మల నీళ్ళు నిండిన కళ్ళతో.. అలా.. అచేతనంగా.. ఆ పక్షులవంక చూస్తూనే ఉంది.

ఎదురుగా తను వేస్తున్న బియ్యపు గింజలను తింటూ.,

పిచ్చుకలు.. ఐదారు.. నాల్గయిదు పావురాలు.. రెండు కాకులు.. అన్నీ పక్కపక్కనే.. సమూహంగా.

ప్రక్కన ప్రహరీ గోడ... ఏపుగా క్రోటన్ మొక్కలు.. ప్రక్కనే మందార చెట్టు.. మట్టికుండలో ఏమిటో అది, పేరు తెలియని అందమైన ఓ మొక్క.. గుంపుగా ఎర్రని ఆకులు.

పిచ్చుకల కిచకిచ ధ్వని... మిగతా దంతా నిశ్శబ్దమే.

పొద్దుట్నుండి కమ్ముకున్న శీతాకాలపు పొగ మంచు ఎందుకో ఇంకా విచ్చుకోవడంలేదు... ఇరవై అడుగుల అవతల ఉన్న గేటు కనబడ్డమే లేదు. చలి చలిగా... వెచ్చవెచ్చగా... తడితడిగా... తేమ.

నిర్మలకిక దుఃఖమాగడంలేదు. జలజలా కన్నీళ్ళు కళ్ళలో నుండి కారుతూనే ఉన్నాయి ఆగ కుండా.

ప్రక్కకు... భయం భయంగా... మళ్ళీ పరమ శివం ముఖంలోకి చూచింది.

ఆరవై ఐదేళ్ళ పరమశివం లుంగీ కట్టుకుని ...పాత తెల్లని, సన్నని బుష్షర్ట్ వేసుకుని, చెదరి ముఖంపై పడ్తున్న తెలుపు నలుపు కలగలిసిన జుట్టుతో... తలను వెనక్కివాల్చి. అరుగుపై అటువేపు, గుమ్మం దగ్గర... ఫేము కుర్చీలో కళ్ళు మూసుకుని.,

ఇద్దరి మధ్యా వాతావరణం నిండా.. ఒట్టి నిశ్శబ్దమే.

అతనిప్పుడేదైనా ఆలోచిస్తున్నాడా..?

..ప్చ్..ఏమో

అరగంట క్రితం సంఘటన జ్ఞప్తికొచ్చింది నిర్మలకు.

''కాఫీ పొడైపోయింది. బయటికెళ్ళి తెస్తా ఐదు నిముషాల్లో'' అంది తను.

ఎందుకు నిర్మలా, నేను తెస్తాగదా!అని పరమ శివం అంటాడని అనుకుందామె. కాని అతనలా అనలేదు. కనీసం ఆమెవంక చూడనైనా చూడ కుండా ఉష్ట్రపక్షి వలె పేపర్లోనే ఉండిపోయాడు. సరేనని నిర్మలే డబ్బులు తీసుకుని వాకిట్లోకి నడచి.. బయటికి కాంపౌండ్ గేట్ తెరుచుకుని..,

ఆశ్చర్యపోయింది నిర్మల. ఎప్పుడూ శివం తన నలా బయటికి వెళ్ళనివ్వడు. కాని,

ఎందుకో ఆరోజు... ప్రొద్దున్న లేచేసరికే దట్టంగా పొగమంచు... చలి వాకిట్లోని మొక్కలు, చెట్లు, పూలు.. తీగలు..అన్నింటిపై బిందువులు బిందువులుగా తడి.. తేమ.

అప్పటికే పిచ్చుకలు... పావురాలు... కాంపౌండ్ గోడపై ఎదురు చూస్తున్నాయి.

మళ్ళీ తను వెనక్కి వెళ్ళి.. గింజలను తెచ్చి.. అరుగు కింది వాకిట్లో చల్లి.,

అప్పుడు కూడా పరమశివం ఏమీ మాట్లాడ లేదు. పేపర్లోనే ఉన్నాడు మనిషి.

ఇక నిర్మల వెళ్ళిపోయింది.

పది నిముషాల తర్వాత నెస్కేఫ్ కాఫీ పాకెట్‌తో వచ్చిన నిర్మల గేట్ తెరుచుకుని అతని ముందు నుండి ఇంట్లోపలికి నడిచివెళ్తూ...

శివం కదలనేలేదు... పేపర్లోనే.

విసుక్కుంది నిర్మల. ఉలుక్కుండా ఏమిటీ మనిషి అనుకుంది. విసురుగా మళ్ళీ ఇంట్లోపలి నుండి అరుగుపై కొచ్చి.. ''ఏం చదువది... నేను బైటికి వెళ్తున్నా వస్తున్నా.. ఏమైనా గమనిస్తున్నావా నువ్వు.'' అంది అతని చేతుల్లోని పేపర్‌ను లాక్కుంటూ.

పరమశివం అమాయకంగా, శూన్యంగా, మౌనంగా చూశాడు నిర్మల వైపు.

''ఏమిటలా'' అంది.

అతన్నుండి జవాబు లేదు.. చూస్తున్నాడంతే తదేకంగా.... అభావంగా.

నిర్మలకెందుకో భయమైంది. అతని చూపులు ఆ క్షణం కోటి ఉప్పెనలై....

ఆమె ఎందుకో తల్లడిల్లిపోయింది.

''అలా చూస్తా వేమిటి... ఏమైంది...?'' అంది.

ఊహు.. శివం ముఖం నిండా ఒట్టి శూన్యం. ఏ పలుకూ లేదు.

''కాఫీ తాగుతావా?''

''.....''

''మాట్లాడవే''

''......'' చూస్తున్నాడంతే అలా.

మామూలుగానైతే తను కాఫీ కలుపుకుని వచ్చేటప్పటికి పేపర్ చదివి ఎంతో ఉద్విగ్నతతో 'ఇక ఈ దేశం బాగుపడదు నిర్మలా... చెడిపోయింది..పూర్తిగా చెడిపోయింది.... ఎంత చెడిపోయిందంటే ఇక ఈ దేశాన్ని ఎవడూ బాగు చేయలేనంతగా నాశనమైపోయింది... లేకుంటే ఏమిటిది.. ఒక్క వ్యక్తి.... ఒక్క వ్యక్తి పన్నెండు వందల కోట్ల రూపాయలు స్కాం..'..అలా అడ్డూ ఐపూ లేకుండా సాగేది మాట.

ప్రతిరోజూ అంతే.. టి.వి. చూస్తున్నా, పత్రిక చదువుతున్నా.,

'మనుషుల్లో అసలు నైతిక విలువులే లేవు నిర్మలా. ఎవర్ని చూచినా డబ్బు... డబ్బు... డబ్బు.... మనుషులకు డబ్బు పిచ్చి ముదిరిపోయింది. గూండాలందరూ ఎమ్మెల్యేలు, మంత్రులు.. కోట్లక్కోట్లు ప్రజాధనం దోపిడీ.. ఉద్యోగుల్లో ఎక్కడ చూచినా లంచగొండితనం, అవినీతి, పైరవీలు.... విచ్చలవిడి మీడియా, బూతు సినిమాలు, వీధికి ఐదు బార్లు.... మద్యం ఆదాయంతో నడిచే ప్రభుత్వాలు.... ప్రతి ప్రాజెక్టులో వందలకోట్ల తిండి.... నిర్లజ్జగా ఎవని మనిషికి వాడు ప్రజాధనపు పంపకాలు..ఛీఛీ..'

అదే వేదన... అదే బాధ... అదే క్షోభ.,

డాక్టర్ పరమశివం రిటైర్డ్ ప్రొఫెసరాఫ్ మెకానికల్ ఇంజనీరింగ్. రాష్ట్రపతి స్వర్ణపతక పురస్కారం పొందిన ఉత్తమ అధ్యాపకుడు. బహుగ్రంథకర్త... సామాజికవేత్త... కవి, రచయిత.,

మనిషంటే చదువు.... జీవితమంతా నేర్చుకో... నేర్పించు.. బ్రతుకంటే పుస్తకం. మనిషికి జీవితం భగవంతుడిచ్చిన అపూర్వమైన వరం. కాని ఎలా బతుకుతున్నారీ మనుషులు? ఛీ ఛీ శ్రీశ్రీ చెప్పినట్టు కుక్కలవలె... నక్కలవలె.. సందులలో పందులవలె.

''శివం'' అంది నిర్మల అతని భుజాన్ని తడుతూ.

''అలా చూస్తున్నావేం''

ఉహు! జవాబు లేదు.

నిర్ధారించుకుందామె ఏదో జరిగిందని.

''శివం..శివం'' అంది ఆందోళనగా, భయం భయంగా అతన్ని కుదుపుతూ.

అతనిలో ఏ స్పందనా లేదు. భ్రుకుటి ముడివడింది. చూపులు శూన్యమై.. మేఘాల్లేని ఆకాశంలా, భుజం పట్టుకుని కుర్చీలో నుండి లేపి.,

లేచాడు సరిగానే. చేతిని పట్టుకుని వెంట నడిపిస్తూ డ్రాయింగ్ హాల్లోకి వచ్చి.,

''ఏమైంది శివం''

ఊహుం..ఒట్టి చూపే.

సోఫాలో కూర్చోబెట్టిందతన్ని నిర్మల.

భయంతో నిర్మలకు ఒళ్ళంతా చెమటపట్టింది ఆ శీతాకాలపు ఉదయం పొగమంచులో.

పరిశీలనగా అతని శరీరమంతా తడిమింది చూపులతో.

నలభై ఐదేండ్ల దాంపత్యం..స్నేహం.. సాహచర్యం.. ఇద్దరూ ఒక్కటే ఐన ఏకత,

దుఃఖం పొంగింది నిర్మలలో... పాతాళగంగవలె.

''శివం ఏమైంది శివం.. చెప్పు... ప్లీజ్... టెల్మీ''

''.....''

''కాఫీ తేనా''

''.....'

ఆమె కెందుకో చటుక్కున ఓ సందేహమొచ్చింది. అరుగుమీదికి ఉరికి పత్రికను తెచ్చి అతని చేతుల్లో పెట్టి..

పత్రికను తలకిందులుగా పట్టుకుని చూస్తున్నాడంటే... అలా...

వంటగదిలోకి ఉరికింది నిర్మల. ఐదు నిముషాల్లో కాఫీ కప్పుతో వచ్చి కప్పును శివంకందించింది. కాని పరమశివం కప్పును పట్టుకోవట్లేదు. ఇదేమిటి అన్నట్టు చూస్తున్నాడు.

ఆమె కాఫీని నోటి దగ్గర పెట్టి త్రాగించే ప్రయత్నం చేసింది.. ఊహుం..వీలు పడలేదు. కాఫీ తాగట్లేదు. అసలు కప్పుకు నోటిని తాకించడమే లేదు.

'నిర్మలా! ఎందుకో అప్పుడప్పుడు చటుక్కున నా మెమరీ బ్లాకైపోయి మెదడు మొద్దుబారుతున్నట్టనిపిస్తోంది నిర్మలా.. ఆ సమయంలో విద్యుత్ ప్రసారం ఆగిపోగానే లైట్ ఆరిపోయినట్టు జ్ఞాపకాలన్నీ అదృశ్యమై.... అసలు నేనెవరో నాకు తెలియట్లేదు. తర్వాత మళ్ళీ రీకనెక్షన్.. పునర్ ఉద్ధరణ.. ఏదో అంతా పిచ్చిపిచ్చిగా, చికాగ్గా, అసహనంగా... ఉద్వేగంగా ఉంది నిర్మలా..' ఈ మధ్య శివం మూడునాల్గు సందర్భాల్లో పదేపదే అన్న మాటలు గింగురుమన్నాయి ఆమె చెవుల్లో.

నిజానికి పరమశివంది అద్భుతమైన అసాధారణ జ్ఞాపకశక్తి. తమ పెళ్ళయిన కొత్తలో నాన్న స్నేహితుడైన ఒక తమిళ కవి తమ ఇంటికొచ్చి ఓ తమిళ కవితను వినిపిస్తే.... పక్కన కూర్చుని ఒక్కసారే విన్న శివం మరుక్షణం దాన్ని ఉన్నదున్నట్టుగా తిరిగి వినిపించాడు... దాదాపు పదిపన్నెండు పాదాలు. అందరం ఎంతో ఆశ్చర్యపోయాం. శివానికి తమిళం రాదు. ఐతే టేప్‌రికార్డర్‌లా విన్నదాన్ని ధారణ చేసి వెంటనే పునరుత్పత్తి చేయగల అసమాన ప్రతిభ అతనిది. ఏకసంతాగ్రాహి.

పరమ.. అంటే అబ్సల్యూట్.. పూర్ణత్వం గురించిన ఒక సమ్యక్ సంకలీకరణ. ఇట్ ఇంటిగ్రేట్స్ ద లిమిట్స్. నిర్మలా మనిషి... ఆత్మ... దైవం... సృష్టి... జీవం... చావు... పుట్టుక... మరణానంతరం పునఃసృష్టి.. వీట



న్నింటి సంకలీకరణ.. విలీనీకరణ... పరమం.

పరమశివం కళ్ళు మూసుకుని తాదాత్మ్యతలో నుండి మాట్లాడుతున్నప్పుడు ఏదో ఓ అశరీరవాణి పలుకుతున్నట్టు..,

కాని యిప్పుడు..

శివంకు జ్ఞాపకశక్తి నశించిందా... స్పృహ ఉండి, చేతన ఉండి.. ధారణలేని అనుభవం ఒక చర్యాశకలమై... మెరిసి మాయమై, మళ్ళీ శూన్యమై మిగుల్తోందా.

అంటే... అంటే... డెమిన్షియా.. మతి భ్రమణ.. శివం మెంటల్ మెమరీ ఫైల్ కరప్టయి, చిన్నాభిన్నమై, ధ్వంసమై, కకావికలై... నిర్మలకు భయం, ఆందోళన, దుఃఖం, బాధ.. అన్నీ ఒక్కసారి కలగలిసి ఉప్పొంగి....

శివం ముఖాన్ని దోసిట్లోకి తీసుకుని, ఎదకు హత్తుకుని భోరున ఏడ్చింది నిర్మల...

ఏడుస్తూనే ఉంది... ఉద్వేగంగా.

శివం పలకడంలేదు. అలా ఉన్నాడంటే పసిపిల్లవాడివలె ఉలుకూ పలుకూ లేకుండా.

'ఇప్పుడు తనేం జేయాలి... ఈ విచిత్రమైన స్థితి.. ఎలా... ఇప్పుడెలా...'

ఎక్కడో చదివింది తను అప్పట్లో.. డెమిన్షియా నుండి క్రమక్రమంగా మనిషి జ్ఞాపకశక్తి శిథిలమై శిథిలమై... అల్జీమర్స్., సర్వజ్ఞాపకాలనూ, మేథో స్పృహనూ కోల్పోయే స్థితి. అల్జీమర్స్

కంపించిపోయింది నిర్మల అల్జీమర్స్ భావన రాగానే.

చటుక్కున ఎదురుగా షోకేస్‌లో ఉన్న పరమశివం రాష్ట్రపతి కె.ఆర్.నారాయణన్ నుండి ఉత్తమ ఇంజనీరింగ్ టీచర్ స్వర్ణపతకాన్ని స్వీకరిస్తున్నప్పటి ఫోటోను తెచ్చింది. శివం ముందు ముఖం దగ్గర ఉంచి..''ఇది చూడు... ఇది చూడు'' అంది.

శివంలో స్పందనే లేదు. ఊర్కే అలా చూస్తున్నాడు మౌనంగా-

వెంటనే నిర్మల తన డైరీ తిరగేసి శివం ప్రియ శిష్యుడు డాక్టర్ మురళీకృష్ణకు ఫోన్ చేసింది. ఏడుస్తూ గడగడా ఏదో చెప్పింది... చెప్పి... అరుగు పైకొచ్చి చుట్టూ చూచింది కళ్ళనిండా నీళ్ళతో.

ఎదుట పక్షులు... అన్నీ అలాగే ఉన్నాయి. కాని ఏ ఒక్కటీ గింజలను తినడంలేదు. అంతా అర్థమైనట్టు అన్నీ తదేకంగా నిర్మలవైపే చూస్తున్నాయి దీనంగా.

ఇంకా విడిపోని పొగమంచు మొక్కలనూ, చెట్లనూ చుట్టుకుని అలాగే ఉంది.

మెదడులో డైనమైట్లు పేలుతున్నట్లు... నిర్మల ..ప్రాణమున్న బొమ్మలా మంచంలో ఒరిగిన పరమశివంను గమనిస్తూనే వంటగది... పడకగది... హాల్... మళ్ళీ బయటి అరుగు.. పిచ్చుకలు... పావురాలు... మొక్కలు... మళ్ళీ హాల్..మళ్ళీ పరమశివం.. అడుగులో అడుగువేస్తూ... అచేతనంగా నడుస్తూ...ఆమె లోపల ఒక గర్జించే సముద్రం-ఇప్పుడెలా..పరమశివం వైభవోపేతమైన గతం... విజయాలు... రాసిన పుస్తకాలు... పొందిన పురస్కారాలు... ఎక్కిన ఎన్నో మెట్లు... వేల మంది శిష్యుల నిర్మాణం... ఒక జీవితకాల సాధన... అన్నీ పరమశివం... వీటన్నింటిని మరిచి.. సకల గత స్మృతులన్నింటినీ కోల్పోయి... ఎవరినీ గుర్తించలేని స్థితికి జారి... ఒక శ్వాసించే బొమ్మయి... చివరికి తనను కూడా గుర్తించలేడా శివం ఇక. పది నిముషాల తర్వాత డాక్టర్ మురళీకృష్ణ ఇంట్లోకి రావడం కన్నీళ్ళలో నుండి లీలగా కనిపించింది నిర్మలకు.

మురళీకృష్ణను పరమశివం గుర్తుపట్టలేదు. కనీసం అతని ఉనికిని కూడా గ్రహించలేదు.

***

కార్లోనుండి డాక్టర్ మురళీకృష్ణ... నిర్మల నెమ్మదిగా పరమశివంను దించి వాకిట్లో నుండి నడిపిస్తూ తీసుకొచ్చి... సోఫాలో కూర్చోబెట్టి.., రాత్రి పదిన్నరైందప్పుడు.ఎదురుగా నిర్మల గూడుకట్టిన దుఃఖమై కూర్చుంది కుర్చీలో.

''అమ్మా..డయాగ్నోసిస్ పూర్తయినట్టే. రక్తపరీక్షలు, ఎమ్ఆర్ఐ, సి టి స్కాన్ రిపోర్ట్స్... అన్నీ ఇది అల్జీమర్స్ లక్షణాలనే సూచిస్తున్నాయి. మెదడుకు సరఫరా అయ్యే రక్తనాళాలలో ఏవైనా అవరోధాలు ఏర్పడ్డప్పుడు తగిన మోతాదులో ఆక్సిజన్ అందదు. దాంతో బల్బుయొక్క ఫిలమెంట్ రాలిపోయినట్టు జీవితకాలమంతా రికార్డయి ఉన్న జ్ఞాపకాలన్నీ ధ్వంసమైపోతాయి. మనిషి ప్రాణమున్న బొమ్మయి పోతాడు. చదవడం, రాయడం, కనీసం బ్రష్ చేసుకోవడం, తలదువ్వు కోవడం... భార్యతో సహా తనను తాను కూడా గుర్తించలేకపోవడం...'' చెబుతున్నాడు మురళీకృష్ణ యథాలాపంగా.అకస్మాత్తుగా పొగిలి పొగిలి బిగ్గరగా ఏడ్చింది నిర్మల.'' సారీ మేడం..బట్..''హాల్ నిండా నిశ్శబ్దం..

''గత వారం రోజులుగా ప్రతిరోజూ వస్తున్నాడు సార్ మా హాస్పిటల్‌కు రాత్రి తొమ్మిది తర్వాత. నా పేషంట్ల రద్దీ తగ్గిన తర్వాత ప్రతిసారీ ఎంతో టెన్షన్ కన్పించేదతన్లో. ఈ సమాజం ఎలా మురళీ... మనుషులు ఇంత నీచంగా ఎందుకు పతనమైపోయారు.? ఈ అవినీతి ఇంత విచ్చలవిడిగా ఎందుకు వ్యాపించింది?? ఈ అనైతికత... ఈ రాజకీయ గూండాయిజం, ఈ ప్రకృతి వనరుల విధ్వంసం... ఈ హింస, ఈ అసమర్థ పరిపాలన... ఈ.. అని ఎంతో వాపోయేవారు. మొన్నయితే ఒక తెలుగు దినపత్రిక కటింగ్ నొకదాన్ని తెచ్చారు నా దగ్గరకి... దాంట్లో ఇండియన మెడికల్ కౌన్సిల్ ఛైర్మన్‌పై ఎసిబి అధికారులు దాడిచేసి ఐదువందల కోట్ల డబ్బు, ఐదు వందల కిలోల బంగారాన్ని పట్టుకున్నట్టుగా వివరాలున్నాయి... ఎంతగానో చలించిపోయాడు శివం సార్. ఆ రోజు బి.పి.రెండు వందల ఇరవై దాటింది... టెన్షన్ వద్దని చెప్పాను..''''......'' నిర్మల మురళీకృష్ణ ముఖంలోకి చూచింది.. నిస్సహాయంగా, దీనంగా.

''ప్రయత్నిద్దామమ్మా... మీరు మాత్రం ధైర్యంగా ఉండండి. ఇప్పుడొక ట్రాన్క్విలైజర్ ఇచ్చాను. ఈ రాత్రి నిద్రపోతాడు సార్. రేపుదయం మళ్ళీ నేనొస్తా''లేచాడు మురళీకృష్ణ.నిర్మల అతని వైపు వెళ్ళిపోతున్న ఆవువైపు దూడలా చూచింది అశక్తతతో.



మురళీకృష్ణ వెళ్ళిపోయి... గేట్ మూసుకుని... ఇంటి తలుపులు పెట్టుకుని...శీతాకాలపు రాత్రి.... చలి తెరలు తెరలుగా వ్యాపిస్తూ...పరమశివం దిక్కు చూచింది నిర్మల. అప్పటికే అతను సోఫాలో కాళ్ళు ముడుచుకుని, కళ్ళు మూసుకుని నిద్రలోకి జారిపోయాడు.నిర్మల అలా నిలబడి... కొయ్యబారిపోయినట్టు స్తంభించి పరమశివాన్ని భావశూన్యంగా చూస్తూనే ఉంది.


'శివం... మరీ భరించలేని స్థాయిలో కుళ్ళిపోతూ కంపుగొడ్తున్న ఈ విలువలు లేని వర్తమాన సమాజాన్ని, నీతి నియమాలు.. నైతిక కట్టుబాట్లు.. సామాజిక ధర్మాలు, బాధ్యతలు.. మనిషికి మనిషి పట్ల ఉండవలసిన మానవీయ సంవేదనలు.. ఏవీ లేక పశువులకంటే హీనంగా ప్రవర్తిస్తున్న ఈ దుర్మార్గ సమాజాన్ని... నువ్వింకా చూస్తూ భరించలేవు. క్షోభపడ్తావు. దుఃఖపడ్తావు. మథనపడ్తావు.. గుండె పగిలి చస్తావు.. అందుకే..యిదిగో నీకీ వరం ప్రసాదిస్తున్నాను..అన్నీ మరిచిపోయి..మరిచి హాయిగా పసివాడివై..' ఎవరో అశరీరవాణి ఏదో వాక్కుని వినిపిస్తున్నట్టు.. ఎక్కడ్నుండో ఓ అతీత భావన ఆమె శరీరంలోకి ప్రవహిస్తున్నట్టు.. ఒట్టి వత్తిలా ఉన్న ఆత్మను ఏదో అగ్ని అంటించి వెలుతురు మొలకను ఉద్దీపిస్తున్నట్లు..హార్డ్ డిస్క్ పోయింది... సిస్టమ్ అండర్ రిపేర్.. కాని మరమ్మత్తు సాధ్యమా..

విలువలు... విలువల కోసం మనిషి జీవించడం... జీవిస్తూ దీపాలను వెలిగిస్తూ పోవడం... ఒక పరంపర.. .ఒక నిరంతర పయనం. ఒక అనంత గమనం.ఆమె సోఫాలో పసిపాపలా నిద్రిస్తున్న పరమశివం ప్రశాంతమైన ముఖంలోకి చూస్తూనే ఉంది అభావంగా. అప్పుడామె హృదయం నిండా సముద్రమంత దుఃఖముంది. కానీ కన్నీళ్ళు లేవు.

*

రచయిత సెల్: (091) 9390109993

# ఒక్క మిత్రుడుంటే బాగుండేది!



ఒక్క మిత్రుడుంటే బాగుండేది
ఇంత మందిలోంచి
రోజూ కలుసుకొనే
ఒక్క ఆప్తుడుంటే బాగుండేది
నా దగ్గరకు రావడానికి
విసుగు చెందనివాడు
నేను వెళ్ళినప్పుడు
ముఖం తిప్పుకోని వాడు
ఎండాకాలం, ఏ చెట్టు నీడలోనో
గ్లాసెడు చల్లనీళ్ళు తాగినట్టు
ఏ కూడలి వద్దనో
నన్ను చూడడం కోసం
అపేక్షగా ఎదురుచూసే
ఒక్క మిత్రుడుంటే బాగుండేది

చిన్నపిల్లలు దాచుకొన్న
'సంత్రా' పిప్పరమెంట్లను
జేబులోంచి తీసి-
అపురూపంగా అరచేతుల్లో
పువ్వుల్లా పోసుకొన్నట్టు
బాధలూ, గాధలూ చెప్పుకొని,
ఆక్సిజన్ గుండె నిండా నిండి-
ప్రాణాలు లేచివచ్చినవాడు
ముక్కలతో, నొక్కలతో
రెక్కలు సవరించుకొనే
ముచ్చటైన పక్షుల్లాగ -
నా సమస్యల్నీ, సంశయాల్నీ
ఓపిగ్గా తాపీగ్గా విని
వీపు నిమిరి ధైర్యమిచ్చే వాడు
పరుగెత్తీ పరుగెత్తీ పడీ లేచీ,
అలసి సొలసిన
ఏ మసక సాయంత్రాల్లోనో
సగం సగం
ఇరానీచాయి పంచుకొనే-
తీయని మనసున్న
ఒక మిత్రుడుంటే బాగుండేది

వర్షం కురిసినప్పుడో
మంచు రాలుతున్నప్పుడో
తెరిచిన గొడుగులాగ
మెత్తని స్వెట్టర్‌లాగ
అమ్మ జ్ఞాపకమంత ఆసరాలాగ
ప్రతీ మలుపులో
ఒంటరి ఆకాశంలో
ఇంద్రధనుస్సు రంగుల్లాగ
కరచాలనం చేసి
పురివిప్పిన నెమలి అందంలా
ఆనందాన్ని వెదజల్లే
ఒక మిత్రుడుంటే బాగుండేది
నిరీక్షిస్తున్నప్పుడు
ఎదురుగా ప్రత్యక్షమయ్యి
తప్పి పోయినప్పుడు
నన్ను వెదికిపట్టుకొని
పాత హిందీ సినిమా పాటల్ని
వందలసార్లు నెమరేసుకొంటూ
దారెంటా కలిసి నడిచే
కమ్మదనం తెలిసిన
ఒక మిత్రుడుంటే బాగుండేది

పండగ నాడు
పర్వదినాల నాడు
సెలవు దొరికిన నాడు
చెలిమిని కలవరించిన నాడు
కారు చీకట్లుగా మబ్బులు పట్టిన
మాయా గుహల్లో దాక్కున్నట్టు
కిటికీలు, తలుపులు మూసేసి-
ఎవరింట్లో వాళ్ళు
బందీలుగా వుండిపోకుండా
జ్ఞాపకాల్ని దండలు గుచ్చి
తడికళ్ళలో ముఖాలు చూసుకొంటూ
క్షణాల కదలికలను మధురం చేస్తూ
చిన్నచిన్న కలహాలతో అలిగి
వెన్నెల చిలిపితనం తెలిసిన
ఒక మిత్రుడుంటే బాగుండేది

ఒకపూట అన్నం లేకపోయినా
అక్కడక్కడా కోరికలు కొన్ని మిగిలిపోయినా
బండరాయి మీద వెన్నెల పొంగిపొర్లి
అలలతో కొలను పరవశించినట్టు
తప్పించుకోవడానికి-
లేనిపోని కతలు చెప్పనివాడు
రోజూ పలకరించుకోవడానికి-
ఎగ్గొట్టే కారణాలు వెదకనివాడు
మిత్రులు కలుసుకుంటేనే-
ఆయుష్షు పెరుగుతుందనే ప్రేమున్నవాడు
ఒరేయ్!
అని పిలిస్తే పులకించేవాడు
ఏందిరా! అని
పన్నీరు చిలికినట్టు పలికేవాడు
కోపమొచ్చినప్పుడు తిట్టీ
నేను దుఃఖించినప్పుడు ఊరడించి
గద్దించీ ముద్దు చేసే
ముక్కుమీదే కోపమున్న
ఒక మిత్రుడుంటే బాగుండేది
కాలి నడకనో
కనుల నౌకలోనో
దోసెడు స్వప్నాల్ని తీసికెళ్తే
చిరునవ్వు కాంతిలో
కళ్ళనిండా నన్ను దాచుకొని
బెంగపెట్టుకున్న పసివాడిలా
నా భుజం మీద వాలిపోయే
ప్రాణ మిత్రుడుంటే బాగుండేది

- ఆశారాజు
9392302245